## కన్నులపండువగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం



.శ్రీకాళహస్తి, మే 29 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయ క్షేత్రపాలకుడు కాలభైరవస్వామి ప్రాకారోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలో వెలసిన కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా క్షేత్రపాలకుడు కాలభైరవస్వామికి పూజలు అభిషేకాలు నిర్వహించి నిమ్మకాయలతో విశేష అలంకరణ చేపట్టారు. ఉత్సవానికి పలువురు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


### శ్రీవారి ఆశీస్సులకోసం

## అమిత్‌షా నేడు తిరుమలకు

### -రేపు వేకువజామునదర్శనం



తిరుమల, మే 29ప్రభాతవార్తప్రతినిధి:
కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేటి సాయంత్రం తిరుమలకు వస్తున్నారు. ఆయన రాకకోసం జిల్లా పోలీసు యంత్రాంగం, టిటిడి అధికార యంత్రాంగం, విజిలెన్స్ విభాగం భద్రత చర్యలు చేపట్టింది. వకుళమాత అతిథిగృహంలో బసచేయనున్నారు. ఆ ప్రాంతం అంతా భద్రత వలయంలో ఉంది. బుధవారం సాయంత్రం బిడిటీమ్, భద్రత దళాలు వకుళమాత ప్రాంతంలో నిశితంగా తనిఖీలు చేశారు.



# అధికారుల అలర్ట్

### తిరుపతి జిల్లా అంతటా డేగకళ్ళు !
### అభ్యర్థుల ఇళ్ళ వద్ద సిసికెమెరాలు

తిరుపతి,మే 29ప్రభాతవార్త:
తిరుపతి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సమయం దగ్గరపడుతుండటంతో జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా అంతటా డేగకళ్ళతో పహారాకాస్తోంది. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల ఇళ్ళ వద్ద సిసికెమెరాలు ఏర్పాటు, నిరంతరం భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలను, ట్రుబుల్ మాంగ్లర్లను గుర్తించారు .కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. జూన్ 4వతేదీ ఓట్ల లెక్కింపు జరిగే కౌంటింగ్ ప్రాంతాల్లో ఇన్నర్‌కార్డెన్, ఓటర్‌కార్డెన్‌ల వద్ద 25 చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి,అన్ని ప్రవేశ నిష్క్రమణ ద్వారాల వద్ద 250మంది సాయుధ బలగాలతో విస్తృతమైన తనిఖీలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 173 మొబైల్‌పార్టీలు, 53ఎస్కార్టు టీమ్‌లు శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు, కార్డెన్‌సెర్చ్ చేపడుతున్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఆ తరువాత అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందస్తు భద్రతలపై బుధవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ,కమిషనర్ అతిథిసింగ్, అదనపు ఎస్పీలు, డిఆర్‌ఓ,ఆర్‌ఓలు పాల్గొని సమీక్షించారు.

# త్వరితంగా ఖచ్చితమైన ఫలితాలు

### ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై సీనియర్ డిప్యుటీ ఎలక్షన్ కమీషనర్ నితీష్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్

చిత్తూరు, మే 29 ప్రభాతవార్త:
ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘ మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితంగా ఫలితాలు పక్కాగా ప్రకటించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని డిప్యుటీ ఎలక్షన్ కమీషనర్ నితీష్ వ్యాస్ అన్నారు. న్యూఢిల్లీలోని నిర్వచన్‌సదన్ నుండి బుధవారం డిప్యుటీ ఎలక్షన్ కమీషనర్ నితీష్ వ్యాస్ జూన్ 4వ తేదీ జరుగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం పక్కాగా నిర్వహించడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. చిత్తూరు కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలులు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో డిప్యుటీ ఎలక్షన్ కమీషనర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటి వరకు ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తీసుకొన్న చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, పుంగనూరు, నగరి, జిడినెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మధుసూదన్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటశివ, చిన్నయ్య, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



డిప్యుటీ ఎలక్షన్ కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీలు.

### టమోటా పంటను

# ధ్వంసం చేసిన గజరాజులు



దెబ్బతిన్న టమోటా పంట
చెల్లా చెదురుగా ఉన్న వరి మూటలు

సదుం, మే 29 ప్రభాతవార్త
మండల పరిదిలో పలు చోట్ల ఏనుగుల దాడుల వల్ల టమోటా పంటకు నష్టం వాటిల్లింది. మంగళవారం రాత్రి నడిగడ్డ పంచాయతీలోని కసిరెడ్డిగారిపల్లె, మతుకువారిపలె ,తిమ్మానాయనపల్లె పంచాయతీ సజ్జలవారిపల్లె పరిదిలోని పొలాల్లో తిరిగాయి. ఈసందర్భంగా మతుకువారిపల్లెకు చెందిన కె.గోవర్ధన్, కే.రత్నమ్మల పొలంలో నూర్పిడి చేసిన వరి 12 బస్తాల వరకు మూటలు కట్టి ఉంటే వాటిని పగుల గొట్టి తిన్నాయి. ఒకరోజు ఏనుగులు రాకుండా ఉండి ఉంటే ఈరోజు ఇంటికి చేర్చుకునేవారిమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కసిరెడ్డిగారిపల్లెలో మునీంద్ర, రామచంద్ర అనేరైతుల టమోటా పంటను తొక్కి వేశాయి. సజ్జలవారిపల్లెలో గురుస్వామి అనే రైతుకు చెందిన టమోటా పంటను నాశనం చేశాయి. మతుకువారిపల్లె రామయ్య టమోటా పంటలో నడుచుకుంటా వెళ్లాయి. ఈక్రమంలో అటవీ సిబ్బందికి గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో బాణాసంచా కాల్చుతూ వాటిని దూరంగా తరిమి వేశారు. ఈక్రమంలో పొలం వద్ద నిద్రిస్తున్న నడిగడ్డకు చెందిన వెంకటరమణ బాణా సంచా శబ్దానికి లేచి పక్కనే ఉన్న మోటారు గదిలోకి వెళ్లాడు. అదేసమయంలో ఆయన ముందర ఏనుగులు నడుచుకుంటు వెళ్లడం కనపడింది.గది బయటే ఉంటే తన పరిస్థితి ఏమయ్యోదో అని ఆయన రాత్రికి రాత్రి నడిగడ్డకు పరుగున వెళ్లిపోయాడు. నష్టపోయిన పంట పొలాలను పలమనేరు సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్, ఆవులపల్లె సెక్షన్ ఆఫీసర్ సురేంద్ర, బీట్‌ఆఫీసర్లు మహేష్, షాజహాన్‌లు సందర్శించి పరిశీలించారు.

# రక్తదాహం తీరని జాతీయ రహదారి

### కల్వర్టును ఢీకొట్టిన కారు : ఒకరు దుర్మరణం
### మరో ఐదుగురికి గాయాలు



చంద్రగిరి, మే 29 ప్రభాతవార్త:
రక్తదాహం తీరని జాతీయ రహదారి నలుగురిని బలికొని నాలుగురోజులైన గడవక ముందే మరో వ్యక్తిని మింగేసింది. మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి వద్ద బుధవారం కారు కల్వర్టును ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. గుడిపాల మండలం, 197 రామాపురంకు చెందిన రామ మూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని తిరుగుప్ర యాణంలో ఎం.కొంగరవారిపల్లి వద్ద కారు కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామమూర్తి (59) మృతి చెందగా, సావిత్రమ్మ (55), సురేష్ (కుమారుడు), పద్మప్రియ (42), తేజు (9), రమ్య (10) గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించిన పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. వరుస ప్రమయాద ఘటనల నేపథ్యంలో బుధవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

# వైభవంగా చక్రస్నానం

### ముగిసిన కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు





తామరగుంట పుష్కరణిలో శ్రీవారికి జరిగిన చక్రస్నానానికి ఆశేషంగా తరలివచ్చిన భక్తులు, చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

నారాయణవనం, మే 29 ప్రభాతవార్త :
పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి బుధవారం చక్రస్నానంతో ముగిసింది. అంతముందు ఉదయం శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు పల్లకీలో నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 8 గంటలకు కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సంబందించి ధ్వజావరోహణంతో ముగిసింది. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం పల్లకీలో అధిరోహించి మాడవీధి, మెయిన్‌రోడ్డు, కొత్తబజారువీధి, పాత బజారువీధి, ఎగువ, దిగువపద్మాశాలీ వీధి, తేరువీధుల్లో ఊరేగుతూ తామరగుంట పుష్కరిణీకి తీసుకెళ్లారు. తర్వాత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనే, కొబ్బరినీళ్లు, పశుపు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం తామరగుంట పుష్కర ణీలో శ్రీవారికి సుదర్శన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. మం డల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు చక్రస్నాన వేడుక లను తిలకించడానికి తరలివచ్చారు. దీంతో తామరగుంట పుష్కరణీ భక్తులతో నిండిపోయింది. వేలాదిమంది భక్తుల సమక్షంలో శ్రీవారికి చక్రస్నానం నిర్వహించారు. భక్తుల గోవిందనామా స్మరణతో పుష్క రిణి కళ కళలాడింది. అంతకుముందు వేదపండితులు వేదమం త్రాలను చదివి వినిపించారు. డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస

# పింఛన్‌దారులకు ఈ సారి పాట్లు తప్పవా!

కోట, మే 29 ప్రభాతవార్త
సామాజిక భద్రత పింఛన్ డబ్బులు తీసుకునేందుకు రెండు నెలలు పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. ఈ సారిపాట్లు తప్పేటట్లు లేదు. మే నెలకు సంబంధించి పింఛన్ సొమ్మును కూడా ప్రభుత్వం లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని నిర్ణయించింది. వీరిలో వృద్ధాప్య, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళలు, కళాకారులు, చర్మకారులు తదితరులు సామాజిక భద్రత పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఏప్రిల్ నెలలో గ్రామ సచివాలయాలకు పింఛన్‌దారులను రప్పించి ప్రభుత్వం లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేసింది. సామాజిక భద్రత పింఛన్లు ప్రత్యేక కేటగిరి కింద ఉన్నా కొందరు లబ్ధిదారులకు మాత్రమే ఇళ్ల వద్దకు వచ్చి సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేసి మిగతా వారందరికీ బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. గత నెల దివ్యాంగులు అనారోగ్య కారణాల దృష్ట్యా మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్న కొంతమందికి మాత్రమే ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్లు పంపిణీ చేశారు. చాలామంది బ్యాంకుల చుట్టూ తిరగలేక అవస్థలు పడ్డారు. ఈ సారి ఇదే పరిస్థితి అయితే ఇబ్బందే అని పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులందరికీ ఇళ్ల వద్దే పింఛన్ అందజేసే ఏర్పాటు చేయాలని పలువురు పింఛన్‌దారులు అధికారులను కోరుతున్నారు.

# హత్యాయత్నంలో నలుగురు అరెస్టు

తిరుపతి, మే 29ప్రభాతవార్త:
చిన్నపాటి అనుమానంతో ఓ అపార్టుమెంట్ లో నివాసముంటున్న రెండు కుటుంబాలు గొడవలు పడి, చివరకు ఎదురింట్లో నివాసముంటున్న వ్యక్తిపై కాపుకాచి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి డిఎస్పీ రవిమనోహర చారి తెలిపారు. వారిలో టిటిడిడిప్యూటీ ఇఇ శ్రీలక్ష్మి,ఆమె భర్తతిప్పన గిరీశ్‌చంద్రారెడ్డి ,ఎస్వీరుయా ఆస్పత్రిలో పురుష నర్సింగ్ కొర్లగుంట రమేష్, తాండవం ధర్మలింగం అరెస్టయ్యారు. ఎన్జీఓ కాలనీలో శ్రీనివాస నిలయంలో నివాసముంటున్న 501 ఫ్లాట్‌లో ఎన్.వెంకటశివారెడ్డి ,502 ఎదురింట్లో టిటిడి డిప్యూటీ ఇఇ శ్రీలక్ష్మి, ఆమె భర్త తిప్పన గిరీశ్‌చంద్రారెడ్డి కాపురముంటున్నారు. వీరికి అప్పులు ఇచ్చినవారు అపార్టుమెంట్‌కు చేరుకుని గొడవపడుతుండటంతో వెంకటశివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయమని ప్రోత్సహించేవాడని ఆరోపణలు. ఈ ఆరోపణలతో తరచూ వారి మధ్య వివాదాలు చెలరేగాయి. దీంతో ఆయనపై కక్షపెంచుకున్న శ్రీలక్ష్మి కుటుంబం హత్యాయాత్నానికి పాల్పడ్డారు.

### వేయి జన్మల పుణ్యఫలం ..

# దేవతామూర్తుల దివ్యదర్శనం

### ముగిసిన కల్యాణ వెంకన్న వార్షిక వసంతోత్సవాలు



చంద్రగిరి, మే 29 ప్రభాతవార్త:
వేయి జన్మల పుణ్యఫలం దేవతామూర్తుల దివ్యదర్శనంతో కలియుగవైకుంతవాసుడు శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి భక్తులు పరవశించిపోయారు. శ్రీనివాస మంగాపురంలో వార్షిక వసంతోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 గంటల నుండి సాయంత్రం 3.30 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి, శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర స్వామి, శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి వారి ఉత్సవమూర్తులకు ఆస్థానం నిర్వహించారు. తదుపరి విష్వక్సేనారాధన, పుణ్యాహావచనం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్రఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం సమర్పించారు. అర్ఘ్యపాద్య నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్ళు), హరిత్రోదకం(పసుపు), గంధోదకం(గంధం)తో స్నపనతిరుమంజనం నిర్వహించారు. చక్రధార, శంఖధార, సహస్రధార, మహాకలశాభిషేకాలను వైఖానస ఆగామోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలసూక్తం, విష్ణుసూక్తం, దశ శాంతి మంత్రములు, తైత్తరీయ ఉపనిషత్తు, దివ్యప్రభంధనంలో అభిషేక సమయంలో అనుసంధానం చేసే నిరాట్టమ పాశురాలను అర్చకులు పఠించారు. ఇందులో ఒక్కోక్రతువులో ఒకమాల వంతున మొత్తం 7 రకాల కురువవేరు, వట్టివేరు, రోజా, మల్లె, సంపంగి, గులాబి, దవణం, తులసి మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సాయంత్రం 6 గంటల నుండి ఊంజల్ సేవ, 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారు తనదేవేరులతో తిరుమాడ వీధులలో విహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాధ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనకే పరిమితమైన 'ఆపాచి'!

శ్రీకాళహస్తిరూరల్,మే 29 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలంలో ఏర్పడుతున్న పరిశ్రమల్లో 'ఆపాచి' మరో మణి పూస అంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌రెడ్డి గత ఏడాది శంకుస్థాపన సందర్భంగా అన్నారు. ఏడాది దాటినా కనీసం ఒక ఇటుక రాయి కూడా ఇక్కడ పడలేదు. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు రూ.700 కోట్ల పెట్టుబడులతో ఆపాచి సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.ఈ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో భూమి పూజలు చేసారు.గత ఏడాది ముఖ్యమంత్రి దావోస్ పర్యటన పారిశ్రామి కీకరణకు ఎంతో ఉపయోగపడిందని ఈ నేపథ్యంలోనే శ్రీకాళ హస్తి మండలంలో ఇప్పటికే ఎన్నో భారీ పరిశ్రమలు ఏర్పాడ్డా యని మంత్రి భారీగా ప్రకటించారు. శ్రీకాళహస్తిమండలంలోని వెంకటగిరికి సమీపంలో 298 ఎకరాల స్థలంలో రూ.700 కోట్ల పెట్టుబడితో అపాచి పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయిం చారు. హంగామా సృష్టించారు. ఈ యూనిట్‌ద్వారా సుమారు పదివేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు ప్రకటించారు. పాదరక్షల తయారికి ఈ పరిశ్రమ పెట్టింది పేరు.ఇనగలూరులో పరిశ్రమ స్థాపనకు పరిశ్రమకు భూములు కేటాయించటంలో స్థానిక నాయకుడు ఎంతో చొరవ చూపారు.అధికారులను ఒప్పించారు.శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాలలో నిరుద్యోగులకు అపాచి ఓ వరంగా భావించారు. రూ.700కోట్లతో ఏర్పాటు చేసే అపాచిలో పది వేల మందికి ఉపాధి అంటే మాటలా? అని భావించారు. కానీ ఈ సంస్థ ఏర్పాటు పునాది రాయితోనే సరిపోయింది. తరువాత ఊసే లేదు. ఎందుకు ఆచరణకు నోచుకోలేదో ఆ ముక్కంటీశునికే ఎరుక. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరులో అపాచి ప్రతిపాదనల గడప దాటలేదు. ఇక 2009లో ఏర్పాటు చేసిన మన్నవరం ప్రాజెక్టు మూతపడింది. పాలకులు అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట లేనపుడు ఉద్యమ బాటగా సాగారు. కానీ అధికార పీఠమెక్కిన తరువాత మరచిపోతున్నారు.




అపాచీ కంపెనీ పరిశ్రమకు శంకుస్థాపనచేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి(ఫైల్‌ఫోటో)

# మంచినీటికి క్లోరినేషన్ పరీక్షలు తప్పనిసరి



## మున్సిపల్ కమీషనర్ జె.అరుణ

చిత్తూరు, మే 29 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పరిధిలో సరఫరా చేసే మంచినీటికి క్లోరినేషన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో బుధవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ నీటి లీకేజీల నివారణ, నీరు కలుషితం కాకుండా తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. టిటిడి కళ్యాణ మండపం వద్ద వున్న టిఎస్ఆర్ ట్యాంకు, గిరింపేట సబ్‌జైల్ సంప్‌లోని నీటికి రెసిడ్యుయల్ క్లోరిన్ పరీక్షలను తనిఖీ చేసి ట్యాంకులోని నీటిలో క్లోరిన్ శాతంను పరీక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నీటి సరఫరా జరుగుతున్న అన్ని ప్రాంతాల్లో ప్రతి రోజు ఆర్‌సి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రధానంగా నీటి సరఫరా జరిగే మొదటి, చివరి పాయింట్ల వద్ద క్లోరిన్ శాతంను లెక్కించాలన్నారు. ఎద్దైనా తేడా వుంటే సత్వరం సరిచేయాలన్నారు. అలాగే వార్డుల వారీగా నీటి సరఫరా పైపుల్లో లీకేజీలను గుర్తించి నివారించాలన్నారు. ఎక్కడా నీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నగర పరిదిలోని శుద్ధనీటి కేంద్రాలు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ గోమతి, డిఇ వెంకటప్రసాద్, ఎఇ రజనీ, లోకేష్ వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నీటి ట్యాంకులో పడి బాలుడు మృతి



సిద్దార్థ్ ఫైల్‌ఫోటో

రామకుప్పం, మే 29 ప్రభాతవార్త
మండలంలోని చెల్దిగానిపల్లి పంచాయతీ బూరుగుమాకులపల్లి గ్రామంలో ఓ బాలుడు నీటి ట్యాంకులో పడి మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. బూరుగుమాకులపల్లికి చెందిన సురేష్ కుమారుడు సిద్ధార్థ్ (5) మంగళవారం అదృశ్యమయ్యాడు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోగా పోలీసులను బాధితులు ఆశ్రయించారు. బుధవారం నీటి ట్యాంకులో పడి బాలుడు మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. కాగా తన కుమారుడు సిద్ధార్థ్‌కు తండ్రి సురేష్ తరచూ నీటి ట్యాంకు వద్దకు తీసుకెళ్లి ఈత నేర్పించేవాడన్నారు. ఈనేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సిద్ధార్థ్ ఈత కోసం నీటి ట్యాంకు వద్దకు వెళ్లి అందులో పడి మృతి చెంది ఉండాడని భావిస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సునీలా నోరు అదుపులో పెట్టుకో..

### - కాంగ్రెస్ పార్టీ మీడియా కోఆర్డినేటర్ నారాయణస్వామి




చిత్తూరురూరల్, మే 29ప్రభాతవార్త:
పార్టీ సీనియర్ నాయకురాలని చెప్పుకొనే సోదరి సునీల పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా కో ఆర్డినేటర్ నారాయణస్వామి హితవు పలికారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారంలోని విషయాలను బహిరంగంగా చర్చించడం క్షమించరాని విషయమని, అలాగే మాజీ కేంద్రమంత్రి చింతామోహన్‌తో ఏదైనా సమస్యలుంటే అధిష్టానంతో చర్చించాలే తప్ప అధ్యక్షురాలిపై బహిరంగంగా వాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నారాయణస్వామితో పాటు పెనుమూరు రవి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల గుర్తింపుకై సర్వే



రామకుప్పం, మే 29 ప్రభాతవార్త
రాష్ట్ర దివ్యాంగుల కమీషనరు ఆదేశాల మేరకు రామకుప్పం భవిత కేం ద్రం ఇఆర్‌పిలు ఉమాదేవి, నాగభూషణంలు మండలంలో ఉన్న దివ్యాంగుల సర్వే చేపట్టారు. వీరు రెండు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో దివ్యాంగులను గుర్తిస్తున్నారు. దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంకు రప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు. భవిత కేంద్రాలకు వచ్చే పిల్లలు అన్ని విధాలా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు.

## తెదేపా మహిళా కార్యకర్త మృతి..

### దేశం నేతల సంతాపం

రామకుప్పం, మే 29 ప్రభాతవార్త
మండలంలోని గొరివిమాకులపల్లి పంచాయతీ పెద్దగెరిగపల్లికి చెందిన తెదేపా మహిళా కార్యకర్త రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఈమె మృతి పట్ల దేశం నేతలు సంతాపం తెలుపుతూ ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దేశం నేతలు గంట్లప్పగౌడు, విశ్వనాథ్, రామిరెడ్డి, వెంకటరెడ్డి, చంద్రప్ప, ప్రవీణ్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

## మారిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

### మండల విద్యాశాఖాధికారి బాబ్జి



పాకాల, మే 29, ప్రభాతవార్త
పాఠశాలలు ప్రారంభం రోజు నుండి మారిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలని తిరుపతి జిల్లా పాకాల మండలం విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్న భోజన కార్మికులకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12వ తేది పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాల్సి ఉంటుందని అన్నారు. రోజూ వారి మెనూను తెలుపుతూ, వాటిని ఎలా అమలు చేయాలో సంబంధిత వీడియోలను ఇంటరాక్టీవ్ ఫానల్ బోర్డ్ సహాయంతో చూపించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు ఉన్నారని అన్నారు. ఎంఈఓ 2 లింగయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల తర్వాత మీరే వారికి తల్లి లాంటి వారని వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంచి పౌష్టికాహారం ఉండే ఆహారం వారికి అందించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం వారిచేత చేయించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసారు. ఇలాగే పాఠశాలల్లో కూడా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయచంద్ర, సిఆర్‌పిలు శ్రీనివాసులు, ప్రకాష్ రెడ్డి, మునికృష్ణ, శివకుమారి, జ్యోతి, ఆఫీస్ సిబ్బంది భార్గవి, రమ్య, పవిత్ర పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనకాయల పంపిణీ

పాకాల, మే 29, ప్రభాతవార్త



ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు వేరుశెనగ విత్తనకాయలను, పాకాల మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం రాయితీ ధరలతో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేసామని ఏవో పుష్పలత తెలిపారు. ఆర్బీకే కేంద్రాల్లో రైతులు తమ ఆధార్ కార్డు, 1 బీ తీసుకువచ్చి బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతలకు 30 కేజీల బస్తా రాయితీ పోను రూ.1710లకు ఇచ్చారు. విత్తనకాయలు పొందిన రైతులు దుర్వినియోగం చేయరాదని, ఈ క్రాప్ నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## 9 వరకు సదుంలో 144 సెక్షన్ అమలు



సదుం, మే 29 ప్రభాతవార్త
వచ్చేనెల 9వ తేదీ వరకు సదుం మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పలమనేరు డీఎస్పీ విష్ణు రఘువీర్ అన్నారు. బుధవారం సాయంత్రం సదుం పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చేనెల 4 వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉంటుందన్నారు. ఆరోజు ఎటువంటి బాణా సంచా కాల్చడం, ర్యాలీలు చేయడం వంటివి అనుమతి లేదన్నారు. జూన్9వరకు 144 సెక్షన్ ఉంటుందని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు వారి వారి ఇళ్లలోనే ఉండాలన్నారు. ఒకరినొకరు రెచ్చగొట్టడం వంటి పనులు చేసుకోవడం, దౌర్జన్యాలకు దిగడం చట్టవిరుద్ధమని చెప్పారు. ప్రజలు అనవసరంగా ఆవేశాలకు లోనుకాకుండా ఉండాలన్నారు. తర్వాత కేసుల్లో ఇరుక్కునే కంటే ముందు జాగ్రత్తగా ఉంటే మంచిదని హెచ్చరించారు. అనంతరం సదుంలోని పురవీధులలో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈమేరకు మైకులో ప్రకటించారు. అదేవిధంగా పాలమంద, కంబంవారిపల్లె, రెడ్డివారిపల్లె, తాటిగుంటపాలెం గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీతో పాటు పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి, సదుం ఎస్సై షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.
29సదుం4ః సదుంలో ర్యాలీ చేస్తున్న పోలీసులు

## నిర్భయంగా ఉండండి మేమున్నాం...!

### -పోలీసు కవాతు



చౌడేపల్లి, మే 29 ప్రభాతవార్త
ప్రజలందరూ నిర్భయంగా వుండి దైనందిక పనులు చేసుకోవాలని సిఐ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం చౌడేపల్లి, దాదేపల్లి వంటి ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఎలంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోన్నామన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

### జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, మే 29, ప్రభాతవార్త



జూన్ నెల 4వ తేది జరగబోవు ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని నేదురుమల్ల జనార్ధన్ రెడ్డి భవనంలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్‌లను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. పోలైన ఓట్లు వివరాలు, ఈవీఎంలలో ఉన్న ఓట్లను పరిశీలించాలని సూచించారు. ఎన్ని ఓట్లు వచ్చాయో ఈవీఎంలలో స్పష్టంగా చూడాలని తెలిపారు. ఈవీఎంలకు స్టీల్ ఉందా లేదా అని కూడా పరిశీలించాలని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు ఏజెంట్లు అన్‌లైన్ బయట రాకూడదని చెప్పారు. ఏజెంట్లకు ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సమావేశంలో జనరల్ ఏజెంట్ లక్కమనేని కోటేశ్వర రావు, ఏజజెంట్లు హరికృష్ణ, మల్లికార్జున రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలని తెలుగు, తమిళ భాషల్లో పోలీసుల హెచ్చరిక

తడ, మే 29 ప్రభాతవార్త



ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలంలోని వివిధ గ్రామాల్లో పోలీసులు తెలుగు, తమిళ భాషల్లో ఎన్నికల నిబంధనల గురించి మైకు ప్రచారం చేస్తున్నారు. బుధవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఖచ్చితంగా పాటించాలని వారు పల్లెల్లో ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగత విమర్శలు చేయకుండా, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా సోషల్ మీడియాలో ప్రచారం చేయకుండా ఉండాలని కూడా చెప్పారు. ఎటువంటి బహిరంగ ప్రకటనలో, కరపత్రాలు, వాల్ పోస్టర్లు వంటివి ఏర్పాటు చేయకూడదన్నారు. రాజకీయ పార్టీలను ఉద్దేశించి కూడా విమర్శలు చేయకూడదని, ఎన్నికల ఫలితాల అనంతరం బాణాసంచా వేడుకలకు దూరంగా ఉండాలన్నారు. విజయోత్సవాలు జరపాలంటే పోలీసుల అనుమతి తీసుకొని నిబంధనలు పాటించాలని చెప్పారు. నాయుడుపేట డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యాన, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, తడ ఎస్ఐ నరసింహారావులు ఇటీవల పలుమార్లు తడ మండలంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ముఖ్యంగా జాలర్ల కుప్పాల పెద్దలతో సమావేశమై ఎన్నికల నిబంధనల గురించి వివరించి ఉన్నారు.

## మండల సర్వ సభ్య సమావేశం



గూడూరు, మే 29, ప్రభాతవార్త
గూడూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో అధికారులు చూడాలని అదే విధంగా విద్యుత్ దీపాలు గ్రామాల్లో సక్రమంగా వెళ్తున్నాయా లేదా పరిశీలించి పునరుద్ధరించాలని వారు తెలిపారు.

## ఉద్యమ నిర్మాత కామ్రేడ్ జక్కా వెంకయ్య

### గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్



గూడూరు, మే 29, ప్రభాతవార్త
గూడూరు పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నెల్లూరు జిల్లా ఉద్యమ నిర్మాత కామ్రేడ్ జక్కా వెంకయ్య 6వ వర్ధంతి సంతాప సభ గూడూరు సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకుడు టి. వెంకటరామిరెడ్డి, జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగి శివకుమార్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని దామరమడుగు గ్రామంలో 1930లో నవంబర్ మూడవ తేది జన్మించారని 2018 మే 29వ తేదిన అనారోగ్యంతో మరణించారన్నారు. 1953లో ఆయన గ్రామం దామరమడుగులో గొప్ప పోరాటం నడిచిందని ఈ ఉద్యమానికి జక్కా వెంకయ్య నాయకత్వం వహించాడని తెలిపారు. నెల్లూరు జిల్లాలో జరిగిన భూపోరాటాలు కూలి పోరాటాలు, రైతాంగ ఉద్యమ పోరాటాలు, 1993లో సారా వ్యతిరేక పోరాటం, సాక్షరతా ఉద్యమం, కార్మిక ఉపాధ్యాయ ఉద్యోగ 1992లో ఆక్వా రైతుల సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల కోసం జీవితాంతం కృషి చేసిన త్యాగమూర్తి అని తెలిపారు. కమ్యూనిస్టు కార్యకర్తలకు తర్ఫీదు ఇచ్చేందుకు సులభమైన శైలిలో అనేక క్లాసులు భోదించి ప్రజా సేవకులుగా వారిని తీర్చి దిద్దారని తెలిపారు. యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పామంజి మణి, సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్. సురేష్, ఆర్. శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, బి. నారాయణ, వెంకట్రావు, బి. చంద్రయ్య, పుట్టా శంకరయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలి

### కెవికె అధిపతి డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరి, మే 29, ప్రభాతవార్త



రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేసుకోవా లని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డక్కిలి మండలం కమ్మపల్లి గ్రామంలో కదిరి బాబు రావు ఉద్యానవన కళాశాల విద్యార్థులు గ్రామీణ ఉద్యాన కృషి అనుభవ కార్యక్రమం రైతు సదస్సు, ఉద్యానవన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు పాటించాలని సూచించారు. ముఖ్యంగా యువత వ్యవసాయం పై దృష్టి సారించాలని తెలిపారు. వ్యవసాయ విద్యార్థులు రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చి ముందుకు తీసుకుపోవాలని తెలిపారు. భూ సార పరీక్ష ఫలితాల సర్టిఫికెట్లను రైతులకు పంపిణీ చేశారు. మూడు నెలల పాటు విద్యార్థులు రైతులతో మమేకమై శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ సి. వీరన్న గౌడ్, కళాశాల బోధన సిబ్బంది సుస్మిత రేచల్, అఖిల్ బాబు, ఓ. తిరుపాల్, రాజీవ్, విజయ శ్రీ, నాగార్జున రెడ్డి, ఉద్యానవన అధికారి ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం పరిశీలించిన కోఆర్డినేటర్



తడ, మే 29 ప్రభాతవార్త
తడ మండలం తడకండ్రిగలోని జిల్లా సమగ్ర శిక్ష ఐఇ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మండల పరిధిలోని అక్కంపేట, చేనిగుంట, మాంబట్టు గ్రామాల్లో ఐఇఆర్‌టిలు చేస్తున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తున్నామన్నారు. విద్యాబుద్ధులు నేర్పించడం కాకుండా ఫిజియోథెరపి చేయడంతో పాటు ఇతర అలవెన్సులు అందిస్తున్నట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, సమదుస్తులు, బూట్లు వంటివి అందించడంతో పాటు వీరంతా అమ్మఒడి పథకానికి కూడా అర్హులుగా చెప్పారు. ఐఇఆర్‌టిలు కల్పన, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో 436వ నేత్రదానం



అనసూయమ్మ (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, మే 29 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని బాపూజీవీధిలో నివసిస్తున్న మాలేపాటి అనసూయమ్మ (77) బుధవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారు ఆమె నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి చెన్నైలోని శంకర్ నేత్రాలయకు పంపారు. దీంతో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో 436 నేత్రాలను సేకరించింది. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



సూళ్లూరుపేట, మే 29 ప్రభాతవార్త
సూళ్లూరుపేట మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూలులో బుధవారం ఈ శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఇఓలు కె.శ్రీనివాసులురెడ్డి, శీనయ్యలు నిర్వాహకులతో మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు, నాణ్యత విషయమై చర్చించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రుచికరంగా వండటంతో, నాణ్యతపరంగా రాజీపడకుండా చేయాలని సూచించారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. భోజనం వండే సమయంలో శుచి శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు వంటలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్‌టిడి భోజన నిర్వాహకులు మధ్యాహ్న భోజన నిర్వాహకులు అలివేలు, కోఆర్డినేటర్ సుధాకర్, మహేష్ పాల్గొన్నారు.

## తడలో నాడు-నేడు పనులపై సమీక్ష సమావేశం



తడ, మే 29 ప్రభాతవార్త
తడ మండలంలోని వివిధ గ్రామాల్లో నాడు-నేడు పనులకు సంబంధించి తిరుపతి జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ఎ ా ం ం ు శ ా ల ల ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జునరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# సామాజిక అభివృద్ధిలో విద్యదే ప్రధాన పాత్ర




శ్రీకాళహస్తిరూరల్,మే 29 ప్రభాతవార్త : సామాజిక అభివృద్ధిలో విద్యదే ప్రధాన పాత్ర అని మాజీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ప్రొఫేసర్ డాక్టర్ టి.లక్ష్మమ్మ అన్నారు. బుధవారం ఎస్ఓఎస్ కార్యాలయంలో విద్యా ప్రాముఖ్యతపై ఎస్ఓఎఫ్ఎస్‌పి మహిళలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ టీ. లక్ష్మమ్మ మహిళలకు విద్య ఎంతో అవసరమో దాని వల్ల సమాజమే కాకుండా తమ కుటుంబాన్ని ఎలా చక్కదిద్దుకోవచ్చునో వివరించారు. అంతేకాక ఇంటి ఇల్లాలు చదువుకున్నదైతే ఆ కుటుంబంలో పిల్లలు కూడా విద్యాపరంగా రాణిస్తారని వివరించారు. ముఖ్యంగా గిరిజనుల్లో చోటు చేసుకున్న న్యూనతా భావాన్ని విడనాడాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధికి విద్య పునాది వంటిదన్నారు. నేడు విద్యలేనందువల్ల ఆర్థిక అంశాలకు ప్రాదాన్యత ఇవ్వటం లేదన్నారు. మన పిల్లల భవిష్యత్తును నిర్దేశించేది విద్య ఒక్కటే అని ప్రతి ఒక గిరిజన మహిళ గుర్తించాలని సూచించారు. గిరిజనుల్లో మనకెందుకు విద్య అనే భావం చోటు చేసుకుంది. సమాజానికి దూరంగా ఉండే మనం చదువుకొని ఏం చేయాలని యోచిస్తున్నారన్నారు. అయితే ఈ భావాన్ని మహిళలు విడనాడాలన్నారు. గిరిజనులకు ఉచిత విద్య అందిస్తున్నారని పాఠశాలలు గురుకులాలు ఏర్పాటు చేసి ఉన్నారని అక్కడ ఆడబిడ్డలను చదివించాలన్నారు. అప్పుడే మీ అభివృద్ధి సాధ్య మౌతుం దన్నారు. ప్రభుత్వాలు గిరిజనులకు రిజర్వ్ చేయబడిన ఉద్యోగాలను కూడా ఇతరలుకు అందిస్తున్నారని కారణం గిరిజనుల్లో చదువుకున్న వారు లేకపోవటమే అన్నారు.ఈ శిక్షణకు అక్కూర్తి, అబ్బాబట్లపల్లి, బత్తినాయక్యాలనీ మేలచ్చూరు గిరిజన కాలనీలు, అక్కూర్తి అరుందతి వాడ, యల్లంపల్లి, వాగవీడు, ముద్దమూడి, పంగూరు,ఊరందూరు ఎస్‌సి కాలనీలకు చెందిన సుమారు 120 మంది మహిళలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎస్ఓఎస్ఎఫ్‌సి లోకేష్, ఇన్‌చార్జి సత్య నారాయణ, సిబ్బంది మునిరత్నం, జీవనాధ్, అనిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కలశపూజలు



నగరి, మే 29 ప్రభాతవార్త: మండలంలోని బుగ్గ అగ్రహారం శ్రీ వన్నూరమ్మ ఆలయంలో చండీసప్తశతి హోమ పూజల్లో భాగంగా బుధవారం కలశపూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చేపట్టిన అలంకరణలు భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఆవరణలో హోమ పూజల సందర్భంగా ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద కలశ పూజను వేదపండితులు నిర్వహించారు. ఆలయ ఆవరణలు వేదమంత్రాలు ప్రతిధ్వనించింది. ఈ పూజలను బ్రహ్మశ్రీ తిప్పావర్జుల శ్రీకాంత్‌శర్మ, నిభణపూడి ఉదయకుమార్ శర్మ, పురాణం దుర్గాప్రసాద్ శర్మ, నవీన్‌కుమార్ శర్మ, మహేష్‌శర్మలు నిర్వహించగా ఆలయ ధర్మకర్త పూజారి వెంకటరెడ్డి పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు.

## వైభవంగా గంగజాతర



పుత్తూరురూరల్, మే 29 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిధిలోని తొరూరు గ్రామంలో గంగజాతర వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి అమ్మవారిని బంకమట్టితో తయారు చేసిన వివిధ రకాల పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం వేకువ జామున గ్రామంలోని గంగమ్మ మండపం వద్ద కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో అమ్మవారికి కుంభాలు వేసి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బుధవారం రాత్రి ఊరేగింపుగా అమ్మవారిని ఊరేగించి నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ



రామచంద్రాపురం, మే 29 ప్రభాతవార్త: చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. బుధవారం రాయలచెరువు, కుప్పంబాదూరు, మిట్టకండ్రిగ, పరమాల పంచాయతీలో ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరుతూ కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా అల్లర్లకు పాల్పడితే జైలుకు వెళ్ళక తప్పదని తేల్చిచెప్పారు. 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనల మేరకు వ్యవహరించాలని అన్నారు. విజయోత్సవ సంబరాలు, భాణా సంచా పేలుళ్ళు నిషేధించినట్లు తెలిపారు.

## బూచివానత్తంలో వైభవంగా గంగమ్మజాతర



విజయపురం, మే 29 ప్రభాతవార్త: మండలంలోని బూచివానత్తంలో బుధవారం గంగమ్మ జాతరను వైభవంగా జరుపుకున్నారు. ఉదయంలో గ్రామంలో మూకుమ్మడిగా అమ్మవారికి అంబలి పోసి మొక్కు తీర్చుకున్నారు. వీధుల్లో వేప తోరణాలు, విద్యుత్ దీపాలంకరణ చేసి కనుల విందు చేశారు. రాత్రి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి భక్తులు మొక్కు తీర్చుకున్నారు.

## సబ్సిడీ జనుము సద్వినియోగం చేసుకోండి - ఏవో



విజయపురం, మే 29 ప్రభాతవార్త: సబ్సిడీలో జనుము తీసుకుని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి రజనికుమారి తెలిపారు. మండలంలో 50 క్వింటాళ్లు సబ్సిడీ జనుము, 10 క్వింటాళ్లు జీలగ ఉందని, కేజీ జనుము రూ.44లకు విక్రయిస్తున్నామని తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచనలు ఇచ్చారు.

## ఎలమంచిలిని అభినందించిన జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షుడు



విజయపురం, మే 29 ప్రభాతవార్త: రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ ఎలమంచిలి రాజేంద్రప్రసాద్‌ను జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్ బుధవారం ఆయనను ఉయ్యూరులో కలుసుకుని సన్మానించారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యదర్శి కుప్పాల మురళి, పంచాయతీరాజ్ కార్యదర్శి కిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలపై విజిలెన్స్ దాడులు



తిరుమల, మే 29ప్రభాతవార్తప్రతినిధి: కొండపై ఎస్వీషాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో రెవెన్యూ విభాగం కేటాయించిన దుకాణాల స్థలం కంటే అదనంగా ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నవారిపై టిటిడి విజిలెన్స్,రెవెన్యూ అధికారులు కొరఢా ఝుళిపించారు. బుధవారం సాయంత్రం షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో పుట్‌పాత్‌లను ఆక్రమించుకుని అడ్డదిడ్డంగా వ్యాపారాలు చేస్తున్నారు. అనధికార వ్యాపారాలపై దాడులు చేశారు.

## అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త



అన్నమయ్య జయంతి వేడుకల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న కార్యక్రమాలు బుదవారం ముగిశాయి. శ్వేత డైరెక్టర్ భూమన్, ఎస్వీయూ అకడమిక్ సలహాదారుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పద్మావతి మహిళ వర్సిటీ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ యువశ్రీ పాల్గొని అన్నమయ్య జీవితం గురించి వివరించారు. ప్రభాతవార్త-తిరుపతి

## చంద్రబాబు సిఎం కావాలని అసోంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పూజలు



కుప్పం, మే 29 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ దేశంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం అసోం రాష్ట్రంలోని గౌహతి నగరంలో నీలాంచల్ కొండపై వెలసి ఉన్న ద్వాదశ శక్తి పీఠాల్లో ఒకటైన, పురాతనమైన మా కామాక్య అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పంలో ఈసారి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ రావాలని సైతం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## నాణ్యమైన మధ్యాహ్నం భోజనాన్ని అందించాలి : ఎంఇఓ



నారాయణవనం, మే 29 ప్రభాతవార్త : జిల్లా విద్యా శాఖ ఉన్నత అధి కారుల ఆదేశాల మేరకు బుధ వారం ఉదయం స్థానిక ఎమా ర్లర్సీ భవనంలో మండ లంలోని మొత్తం 46 పాఠశాలలకు చెందిన ఎండిఎంలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఓలు హెచ్ ప్రభాకర్‌రాజు, కె గోవిందస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి వారి పాఠశాలలో పాఠశాలలు సెలవులు ముగిసిన తర్వాత ప్రారంభం నుంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని రుచికరంగా అందించాలన్నారు. నాణ్యమై భోజనాన్ని అందించడం వల్ల పిల్లలు పుష్టిగాను, బలంగాను ఆరోగ్యవంతంగా వుంటారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెను మేరకు ప్రతి రోజు భోజనాన్ని అందించాలన్నారు. అలాగే పాఠశాలలోని వంట గదులను, పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలనా న్నరు. దీని వల్ల పాఠశాలలకు పిల్లల సంఖ్య పెరిగే అవకాశాలు వుందన్నారు. గ్రూపుల వారిగా కాంపిటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆఫరేటర్ జయరాం, సీఎంఆర్డీ సత్యేంద్రకుమార్, ఐఆఆర్‌పిలు విజయన్, భరత్, ఎంఆన్‌సిలు పాల్గొన్నారు.

## టిడిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం



నారాయణవనం, మే 29 ప్రభాతవార్త : నారాయణవనం మాజీ ఎంపిపి, టిడిపి నాయకులు ఎపి భక్తవత్సలం అత్త కన్నమాల్ బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆమె మృతి వార్తను తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం నగరిలోని పుదుపేటకు వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, కొండూరు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు విద్యాసామగ్రి



శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డులోని ఈశ్వరయ్య గిరిజన కాలనీ విద్యార్థులకు బుధవారం సంఘ సేవకులు కోటేశ్వరబాబు విద్యాసామగ్రిని అందించారు. ఇటీవల కేటేశ్వరబాబు భరద్వాజ తీర్థంలోని బిసి కాలనీలో గల పాఠశాల విద్యార్థులు విద్యాసామగ్రిని అందిం చారు. పట్టణ నడిబొడ్డులోని పెద్ద కోనేరు వద్ద ఉన్న ఈశ్వరయ్య గిరిజన కాలనీ లో చదువుకుంటున్న విద్యార్థులతో మమేకమయ్యారు. ఇక్కడ 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకుంటున్న 30 మంది విద్యార్థులను గుర్తించారు. తల్లిదండ్రులకు ప్రభుత్వాలు కల్పిస్తున్న వెసులుబాట్లును వివరిస్తూ ప్రతి ఒక్కరు చదువుకుంటే మంచి ఉద్యోగవకాశాలుంటాయని వివరించారు.అభద్రాత భావాన్ని విడనాడి పేదరికం రూపు మాపటానికి విద్య ఒక్కడే మార్గమని వివరించారు.కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## వెంకటాపురంలో జాతర సంబరాలు

శ్రీకాళహస్తిరూరల్, మే 29 ప్రభాతవార్త : పంటల కాలం అయ్యింది. గ్రామ దేవత చల్లంగా చూసింది. ఇక అమ్మకు మొక్కులు తీర్చుకోవాలనే లక్ష్యంతో గ్రామాల్లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి.ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి గ్రామంలో సంబరాలు మిన్నంటాయి. గ్రామాన్ని చక్కగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. నాలుగువీధులు సంబరాలతో నిండింది. టుట్టు పక్కల గ్రామాల తో వచ్చిన బంధువులు స్నేహితులతో నిండింది. విందు వినోదాలు చోటు చేసుకుంది. మంగళవారం అర్థరాత్రి దాటిన తరువాత గంగమ్మకు ముసుగు తొలగించి జంతు బలి ఇచ్చి గ్రామోత్సవానికి తరలించారు. అంగరంగ వైభవంగా జాతర సంబరాలను నిర్వహించారు. అయితే ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేసారు.బుధవారం ఉదయం నుంచి గ్రామంలో గంగమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

## అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు



తొట్టంబేడు, మే 29 ప్రభాతవార్త : మండలంలోని తొట్టంబేడు శ్రీచైతన్య పాఠశాలలో 1 నుంచి 7 వ తరగతి వరకు మాత్రమే అనుమతి ఉంది. అయితే ఇక్కడి పాఠశాల విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించి 8 నుంచి 10వరకు తరగతులు నిర్వహిస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారికి పిర్యాదులు అందడంతో ఆయన ఆదేశాల మేరకు ఎంఈవో-1 సిహెచ్‌ఎం.భారతీ మరియు శ్రీకాళహస్తి ఎంఈవో-2 అంబటిబాలయ్యలు కలసి శ్రీచైతన్య పాఠశాలను కలసి తనిఖీ చేయడం జరిగింది. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతి ఉన్నారని 8 నుంచి 10 తరగతులకు అనుమతి లేదని తల్లిదండ్రులు కూడా దీన్ని గమనించాలని ఎంఈవోలు కోరారు. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలుతీసుకోవడంతోపాటు పాఠశాల గుర్తింపును రద్దుచేస్తామని హెచ్చరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యానికి ఇరువులు ఎంఈవోలు నోటీసులు జారీచేశారు. ఈసందర్భంగా ఎంఈవో బాలయ్య మాట్లాడుతూ పట్టణంలో అనుమతి లేకుండా పాఠశాలలో తరగతులు నిర్వహిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ఏఏ తరగతులకు ఎంతెంత ఫీజులు వసూలు చేస్తున్నారో పాఠశాలల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకపై ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను తనిఖీచేస్తామని వివరించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

తొట్టంబేడు, మే 29 ప్రభాతవార్త : తొట్టంబేడు మండల సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ఈసందర్భంగా పార్లమెంటు సాధారణ ఎన్నికలకు మరియు రాష్ట్ర సాధారణ ఎన్నికలు 2024 నోటిఫికేషన్ జారీ చేసినందున ఎన్నికల నియమనిబంధనలుకు లోబడి మండల ప్రజాపరిషత్ సమావేశభవనంలో నిర్వహించనున్నట్లు వివరించారు. సర్వసభ్య సమావేశంలో గ్రామీణ త్రాగునీటి సరఫరా మరియు పారిశుద్య విభాగం ప్రగతిపై సమీక్ష, వైద్య మరియు ఆరోగ్యశాఖ ప్రగతిపై సమీక్ష, వ్యవసాయ శాఖ ప్రగతిపై సమీక్ష, విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రగతిపై సమీక్ష ఉంటుందన్నారు.

## సరస్వతీకండ్రిగ గంగజాతర వేడుకల్లో పవిత్రరెడ్డి



ఏర్పేడు, మే29, ప్రభాతవార్త; మండలంలోని సరస్వతీకండ్రి గ్రామంలో బుధవారం గంగజాతర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రరెడ్డి జాతర వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. అమ్మవారి సేవలో పాల్గొని మ్రొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలోని వైసిపి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గున్నేరి కిషోర్‌రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, శ్రీనివాసులు యాదవ్, జనార్ధన్ యాదవ్, అయోధ్య, మైరామయ్య, చంద్ర, సుబ్రమణ్యం యాదవ్, హేమంత్, రాఘవరెడ్డి, రాంబత్తెయ్య యాదవ్, వెంకటేష్, చంద్రరాజు, జయముని, చెంగల్రాయులు, హరినాధ్, గంగాధర్, గురునాధం, మహేష్ , కుశాల్, జీపి యాదవ్,గంగయ్య యాదవ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య యొక్క ప్రాముఖ్యతపై అవగాహన



ఏర్పేడు, మే29, ప్రభాతవార్త; మండలంలోని నాగంపల్లి గ్రామ పరిధిలో వెలసిన ఎస్ ఓ ఎస్ చిల్డ్రన్స్ గ్రామంలో ఎఫ్ ఎస్ పి వారి ఆధ్వర్యంలో బుధవారం విద్య యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ టి లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ వ్యక్తిగత మరియు సామాజిక అభివృద్ధిలో విద్య పోషించే కీలక పాత్ర వివరించారు. విద్య పురోగతికి మూలస్తంభం అని, అలాగే విద్య ఆవిష్కరణలకు మూలం అని, ఆర్థిక వృద్ధి, సామాజిక ఐక్యతకు విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. భావి తరాల వారి ఉజ్వల భవిష్యత్తును రూపొందించడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ప్రస్తుత సమాజంలో షెడ్యూల్ తెగల వారు ఇప్పటికి విద్యాభ్యాసానికి కొంత దూరంగా ఉన్నారని వారు రాబోయే రోజుల్లో తప్ప కుండా విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి వారు కూడా చదువుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ట్రైబల్ కమ్యూనిటీ గ్రామాలైన అక్కూర్తి, అబ్బాబట్లపల్లి, బత్తినయ్యకాలనీ, మేలచ్చూరు, ఇతర కమ్యూనిటీ గ్రామాలైన అక్కూర్తి అరుంధతివాడ, యల్లంపల్లి, వాగివేడు, ముద్దమూడి, పంగూరు, ఊరందూరు ఎస్సీ కాలనీలకు సంబంధించిన 120మంది మహిళలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలోఎస్ ఓ ఎస్ ఎఫ్ ఎస్ పి లోకేషన్ ఇంచార్జ్ సత్యనారాయణ, మునిరత్నం, జీనథ్ మరియు అనిమేటర్లు పాల్గొన్నారు.

## అంకుర ఆసుపత్రిలో ఐదేళ్ల బాలుడికి అరుదైన చికిత్స




తిరుపతి హెల్త్, మే 29 ప్రభాతవార్త : స్థానిక రేణిగుంట రోడ్డులోని అంకుర హాస్పిటల్‌లో శ్రీకాళ హస్తికి చెందిన కానిస్టేబుల్ దంపతుల ఐదేళ్ల బాలుడు గిలియన్-బార్ రే సిండ్రోమ్ (జిపిఎస్) వ్యాధితో చికిత్స కోసం వచ్చి అనంతరం తాము అందించిన మెరుగైన వైద్యంతో కోలుకొని నడుస్తూ అద్భుతమైన పురోగతిని బాలుడు ప్రదర్శించాడని అంకుర ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ మీడియాకు తెలియజేసారు. బుధవారం మీడియా ముందు బాలుడి తల్లిదండ్రులు, డాక్టర్లు రవిచంద్ర (పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్), దినేష్‌రెడ్డి, పృధ్వి, పార్ధసారథి (పీడియాట్రిక్ ఇంటెన్సీవిస్టులు) మాట్లాడుతూ మల్టీ డిస్కనరీ మొత్తం కలిసి ఈ అరుదైన చికిత్స అందించామని తెలియజేసారు. ఏప్రిల్ చివర్లో చేరిన బాలుడుకి శ్వాస, ఆక్సిజన్ థెరఫీతో ఏడు రోజులు పాటు మెకానికల్ వవెంటిలేషన్ ద్వారా వైద్యం అందించామన్నారు. రెండు వారాల సమగ్ర సంరక్షణ తర్వాత బాలుడిని డిశ్చార్జ్ చేసామన్నారు. ఆసుపత్రిలో చేరినరోజు నడవలేని బాలుడు నేడు అవలీలగా నడుస్తూ చలాకీగా ఉన్నాడని తెలియజేసారు. ఇది అంకుర వైద్యులు, సిబ్బంది కృషి అని తెలియజేసారు.

## మంగాపురం అడవిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి!

సత్యవేడు, మే 29 ప్రభాతవార్త: సత్యవేడు మండలం అలిమేలు మంగాపురం కమ్మోళ్ళ మెట్ట అడవి ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం బయట పడింది. వివరాలు ఇలా.... బుధవారం ఉదయం స్థానికులు కొందరు అడవి ప్రాంతంలో పడి ఉన్న మృతదేహాన్ని కనుగొన్నారు. సమాచారాన్ని సంబంధిత వీఆర్ఏకు అందించారు. అనంతరం వీఆర్ఏ పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుళ్లిపోయి కంపు కొట్టుతుండడంతో వృద్ధుడు చనిపోయి మూడు నాలుగు రోజులు అయి ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. మృతి చెందిన వృద్ధుడు వయసు 70 ఏళ్లు ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో శవాన్ని అలిమేలు మంగాపురం పురం పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది అడవి ప్రాంతంలోనే పూడ్చి వేసి దహన సంస్కారాలు జరిపారు. మృతి చెందిన వృద్ధుడు పలు ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ జీవనం కొనసాగించినట్లు స్థానికులు చెబుతున్నారు.

## సుధీర్‌రెడ్డి గెలుపు కోసం శ్రీ గంగమ్మకు ప్రత్యేక పూజలు



రేణిగుంట, మే 29 ప్రభాతవార్త: టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపు కోసం రేణిగుంట పట్టణ తెలుగు యువత నేత ఎంజీ రెడ్డి అత్తూరు శ్రీ గంగమ్మ తల్లికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. రేణిగుంట మండలం అత్తూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ గంగమ్మతల్లి జాతర వైభవంగా జరుగుతోంది. జాతరలో భాగంగా రేణిగుంట పట్టణ టీడీపీ యువనేత ఎంజీ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరప్రసాద్, మంచి విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా, భారత కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెబుతున్న మోదీ ప్రధాన మంత్రిగా గెలవాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో అత్తూరు యువకులు పునీత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, అత్తూరు టీడీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి, హరిరెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డి, అంబికా పతి తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన దొడ్ల కరుణ



తిరుపతిరూరల్, మే 29 ప్రభాతవార్త: గంగజాతరను పురస్కరించుకుని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త దొడ్ల కరుణాకర్‌రెడ్డి బుధవారం గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. తుమ్మలగుంట గ్రామ ప్రజలను చల్లంగా చూడాలని కోరుకున్నారు. గ్రామంలో ఎలాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిరుదాల సిద్దారెడ్డి, తులసీ రామిరెడ్డి, రాధారాయల్, చంగల్ రామానాయుడు, శ్రీనివాసులు రాయల్, నవీన్ రాయల్, సురేష్, భాస్కర్‌రెడ్డి, రేవంత్, శ్రీను, మధుసూదన్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, కృష్ణ, ముకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక లోపము...కారాదు శాపము

### -ఆత్మస్థైర్యంతో ముందుఅడుగు వేయాలి



తిరుపతిరూరల్, మే 29 ప్రభాతవార్త: మానసిక లోపము బాల్యానికి కారాదు శాపమని, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని నేస్తం అధ్యక్షులు బి.జోగరత్నం పేర్కొన్నారు. బుధవారం తిరుపతి రూరల్ దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో వున్న అక్షయక్షేత్రం ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులకు శానిటరీ వస్తువులు, హైజానిక్ వస్తువులు, స్నానపు సబ్బులు, మామిడి పండ్లు నేస్తం సంస్థ ద్వారా పంపిణి చేసారు. విధి వంచనతో వున్న పౌరులు సమాజంలో భాగస్వామ్యులేనని, జీవితంలో నిరాశ, నిస్పృహలకు తావు ఇవ్వరాదన్నారు. మానసిక అంగవైకల్యం కారాదు శాపమని తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మానసిక లోపాన్ని చాలెంజ్‌గా తీసుకుని జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. విద్య, ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అక్షయక్షేత్రం స్పెషల్ టీచర్ మునెమ్మ, మెడికల్ ఇన్‌చార్జి, ఎఎన్ఎం ఆర్.బుజ్జమ్మ, కో-ఆర్డినేటర్ ఎస్.కె. బషీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఉపాధ్యక్షులు శివశంకర్, చెంచుముని, సాయిప్రసాద్, లీలావతి, కార్తీక్, దరణి తదితరులు పాల్గొన్నారు.

# సంయమనం పాటించండి ... శాంతిభద్రతలకు సహకరించండి..!

### సమస్యాత్మక గ్రామాల ప్రజలతో ఎస్పీ హర్షవర్ధన్ రాజు



చంద్రగిరి, మే 29 ప్రభాతవార్త: కౌంటింగ్ సమీపిస్తున్న వేళ ప్రజలు సంయమనం పాటించాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రజలకు హితవు పలికారు. సమస్యాత్మక పంచాయతీల పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన పనపాకం, కల్‌రోడ్‌పల్లి, కాశిపెంట్ల, ఎంకొంగరవారిపల్లి, ముంగిలిపట్టు, ఐతేపల్లి, రామిరెడ్డిపల్లి, కూచివారిపల్లిలో ప్రజలతో మమేకమై పలుసూచనలు చేశారు. 5 ఏళ్ళకు ఒకసారి ఎన్నికలు వస్తుంటాయనీ, కౌంటింగ్ ప్రకియ సహజమైనదేనని అన్నారు. అయితే మీరంతా మీ గ్రామాలలోనే వుండాలనీ, ప్రతి ఒక్కరూ కలసి మెలసి జీవించాల్సి వుంటుందని అన్నారు. కౌంటింగ్ సందర్భంగా పటిష్ట భధ్రతా చర్యలు చేపట్టినట్లు వివరించిన ఆయన 144 సెక్షన్ అమలులో వుంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్న ఆయన ప్రజలు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. విజయోత్సవ సంబరాలు, భాణాసంచా పేళుళ్ళు చేయవద్దని తేల్చిచెప్పారు.

# రైతులకు చెల్లింపులు చేయక...వేధింపులు



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఉమ్మడి చిత్తూరుజిల్లాలోనే ధాన్యాగారం. ఇక్కడ రబీ సీజన్‌లో సమారు 32వేల హెక్టార్లలో వరి పండిస్తారు.అయితే పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు ఇళ్ళలో ధాన్యాగారాల్లేవు. దాంతో పండించిన ధాన్యాన్ని కల్లాల్లోనే దళారులకు అప్పగిస్తున్నారు.అయితే ధాన్యం సేకరించిన దళారులు రైతులకు సకాలంలో చెల్లింపు చేయటం లేదు.దాంతో రైతులు గ్రామాల నుంచి తిరగలేక తిప్పలు పడుతున్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించి మిల్లర్ల చేత నిర్లక్ష్యం చేయబడిన ఓ వ్యాపారి బుధవారం శ్రీకాళహస్తిలోని ఆర్‌డిఓ కార్యాలయంలో ఓ మిల్లర్ నిర్లక్ష్యం మోసం గురించి ఫిర్యాదు చేసారు. వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం వెంకటాపాళెంకు చెందిన ఓ వ్యాపారి కూనాటి లోకేష్ యాదవ్ ఆర్‌డిఓకు ఫిర్యాదు చేసి మీడియాతో మాట్లాడుతూ తాను 3 సంవత్సరాలుగా శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నియోజక వర్గాల్లోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి శ్రీకాళహస్తి పరిసరాల్లోని మిల్లర్లకు అందించే వాడని వివరించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో వరదయ్యపాళెం మండలం అయ్యోరిపాళెంకు చెందిన పలువురు రైతుల వద్ద సుమారు 3లారీలు వెయ్యి బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి పెంకుల పాడు వద్ద ఉన్న ఓ ప్రైవేటు మిల్లర్‌కు సరఫరా చేసినట్లు వివరించారు. ఇందుకు రూ.18,27,000లకు గాను మిల్లర్‌రూ.13,19,320లు చెల్లించారని మిగిలిన సొమ్ము రూ,5,08,000 చెల్లించాల్సి ఉందన్నారు.కానీ నెలలు గడుస్తున్నా చెల్లింపులు చేయలేదని దాంతో రైతులు తనను నిలదీయగా రైతులతో కలసి మిల్లర్‌వద్దకు వెళ్ళి చెల్లింపులకు సంబంధించి ప్రశ్నించగా చెల్లింపులు చేయక పోగా దాడి చేసి రైతులను కొట్టారని మహేష్ ఆరోపించారు.ఈ అంశానికి సంబంధించి తాము పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించారు.అయితే రైతులకు రావాల్సిన చెల్లింపులకు సంబంధించి న్యాయం చేయాలని ఆర్‌డిఓను కోరామన్నారు. గతంలో కూడా పలువురు ఇలాగే చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

# కాయ్ రాజా కాయ్...!

## -గెలుపోటములపై ఊపందుకొన్న బెట్టింగులు



చౌడేపల్లి, మే 29 ప్రభాతవార్త : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓట్లను ఇవిఎంలలో నిక్షిప్తం చేసివున్నారు. ప్రస్తుతం అవి స్ట్రాంగ్‌రూమ్‌లందు భద్రంగా వున్నాయి. వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు జరగనున్నది. లెక్కింపుకు కేవలం 5రోజులు మాత్రమే ఉండటంతో అభ్యర్థులతోపాటు రాజకీయ పార్టీల నాయకుల్లో గుబులు నెలకొనింది. మరికొందరు ఒకడుగు ముందుకేసి వేల నుంచి లక్షల్లో బెట్టింగులకు పాల్పడుతున్నారు. అభ్యర్థుల గెలుపోటములపై కొందరు, మెజార్టీలపై మరికొందరు పందేలుకొంటున్నారు. వీటితోపాటు రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న విషయం మీద లక్షలాదిగా బెట్టింగులు వేస్తున్నారు. బెట్టింగులకు పాల్పడే వారిలో 30నుంచి 50యేళ్ళ వయస్సు మీరిన వారే అధికంగా వున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ రాయుళ్ళ నోట క్రాస్ ఓటింగ్ మాట అధికంగా వినిపిస్తోంది. రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ అధికంగా జరిగినట్లు వారి నోట వస్తోంది. ఈదిశగా సైతం పందేలు అధికంగా కడుతున్నట్లు తెలిసింది. మా పార్టీ గెలుస్తుందంటే మా పార్టీ గెలుస్తుందని బహిరంగంగానే బెట్టింగులకు సై అంటున్నారు. రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి వస్తుంది. రాయలసీమ, ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పరిస్థితి ఏంటని రాజకీయ విశ్లేషకుల చుట్టూ తిరిగడం, వారి సలహాల మేరకు పార్టీలపై బెట్టింగులు వేయడంలో పందేగాళ్ళు తలమునకలై వున్నారు. ముఖ్యంగా పుంగనూరు, కుప్పం, పిఠాపురం, మంగళగిరి లాంటి నియోజక వర్గాలపై అధికంగా బెట్టింగులు జరుగుతున్నట్లు చర్చించుకొం టున్నారు. వివిధ పార్టీలపై వాడింత పందెం కట్టాడు, వీడింత కట్టాడు అంటూ ఏ టీకొట్టు వద్ద విన్నా ఇదే చర్చ నడుస్తోంది. తమ అభిమాన నేత గతం కంటే 10వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందుతాడని లక్షల్లో బెట్టింగులు జరుగుతున్నాయి. ఎప్పుడెప్పుడు ఓట్లు లెక్కిస్తారా...పందేలు నెగ్గి ఏక్ధమ్ షావుకారులు కావాలన్న తపనతో కొందరు ఉండగా, మరికొందరికి రాత్రిళ్ళు సైతం నిద్ర పట్టకుండా చరవాణిల ద్వారా గెలుపోటములను అడిగి తెలుసుకొంటున్నారు. ఇప్పిటి వరకు ఐపిఎల్ బెట్టింగులు మాత్రమే చూసిన మనం వివిధ పార్టీలకు చెందిన గెలుపు గుర్రాలపై వేసిన పందేలాను చూస్తున్నాం. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో జూన్ 4వరకు వేచి చూడాల్సిందే.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి... కిట కిట లాడిన భక్తులు



శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి బుధవారం భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి గంటల తరబడి నిరీక్షించారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజల కోసం సామన్య భక్తుల తిప్పలు వర్ణనాతీతంగా ఉంది.వేసవి కాలంలో సాధారణంగానే రద్దీ అధికంగా ఉంటుంది. బుధవారం సుమారు 20వేల మంది భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనానికి తరలి వచ్చారు.ఇక శ్రీకాళహస్తీశ్వరాలయాధికారులు తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలు, ఆలయంలో దళారులను కట్టడి చేయకపోవటం పట్ల భక్తులు తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. బుధవారం సుమారు 20వేల మంది స్వామి అమ్మవార్ల దర్శనానికి రాగా సుమారు 2500 మంది సర్పదోష నివారణ పూజలు జరిపించుకున్నారు.

**దళారుల దందాతో భక్తుల విసుగు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్ధలతో వస్తున్న భక్తులు ఇక్కడి దళారుల నిలువుదోపిడి గురౌతూ అధికారులను, పాలకులను తప్పు పడుతున్నారు. ఇంతటి దోపిడినా? అని సామాన్యభక్తులు నొచ్చు కుంటున్నారు. ఆలయానికి వచ్చిన సామాన్య భక్తుడు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షిస్తుండగా దళారులు తీసుకెళ్ళె వారు దర్జాగా గేట్లు తెరచుకొని వెళుతుంటే ఇక్కడ పలుకుబడి,పైసలకే ప్రాధాన్యతా? అని వాపోతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటి కానీ,హోంగార్డులు కానీ స్వేచ్ఛగా పని చేసే పరిస్థితి లేదు.ఎవరైనా గేట్ల వద్ద ఖచ్చితంగా వ్యవహరిస్తే అలాంటి ఉద్యోగులు బెదిరింపులు హెచ్చరికలు ఎదుర్కొంటున్నారు.ఇక దళారులకు అనుకూలంగా పిఆర్‌ఓ కార్యాలయంను మార్చారనే విమర్శలున్నాయి. పవిత్రమైన ఆలయంలో అవినీతి పెచ్చుపెరిగిపోతే అధికారుల్లో కనీసం స్పందన లేదంటే ఎవరి వాటాలు వారికి అందుతుంటే ఎవరు ఏ విమర్శలు చేస్తే మాకేంటి? అనే విదంగా వ్యవహరిస్తున్నారు. దాంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మరో సారి రావాలంటే భయపడుతున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అడుగుపెట్టినప్పటి నుంచి దర్శనాలు పూర్తి అయ్యే వరకు దళారులతో సతమతమౌతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సామాన్యభక్తులకు మాటల్లో కాక చేతుల్లో సుదర్శనం సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

# అన్న దాడి ఘటనలో తమ్ముడు మృతి!



గూడూరు, మే 29 ప్రభాతవార్త : గూడూరు మండల పరిధిలోని చంబడిపాలెం గ్రామంలో సోమవారం జరిగిన ఘర్షణలో పురిణి అశోక్ (30) యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రూరల్ పోలీస్‌ల సమాచారం మేరకు గూడూరు మండల పరిధిలోని చంబడి పాలెం గ్రామంలో నివసిస్తున్న పురణి మస్తానయ్య అతని తమ్ముడు అశోక్‌లకు అదే గ్రామానికి చెందిన మధుసూదన్ కుమారుడు గురవయ్యకు మధ్య వ్యక్తిగత కారణాలతో ఘర్షణ మొదలైందన్నారు. ఈ క్రమంలో మస్తానయ్య, అశోక్ ఇద్దరు కలిసి గురవయ్య ఇంటికి వెళ్లి గొడవపడి గురవయ్య తండ్రి మధుసూదన్ పై మస్తానయ్య కర్రతో దాడి చేయడంతో అడ్డుకోబోయిన అశోక్‌కు కర్ర తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అశోక్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పొరపాటున అన్న చేతిలో కర్ర సొంత తమ్ముడుకు తగిలి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# శివయ్యను దర్శించకున్న ఎంఎల్‌సి పార్టీ పరిశీలకులు



శ్రీకాళహస్తి, మ 29 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం ఎంఎల్‌సి పార్టీ జోన్4 పరిశీలకులు రాంగోపాల్‌రెడ్డి విచ్చేశారు. ఆయనకు రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ఆధ్వర్యంలో దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆయనకు గురుదక్షిణామూర్తి వద్ద ఆలయాధికారులు మరియు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీపతిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కామేష్‌యాదవ్, పార్లమెంటు బిసి కార్యదర్శి ఎంఎస్‌రెడ్డి, మండల బిసి సెల్ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, మునిరెడ్డి, పార్లమెంటు యువత అధికార ప్రతినిధి రాఘవులు యాదవ్, పార్టీ నాయకులు మణికంఠరెడ్డి, సోమశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకొండామర్రిలో ఘనంగా గంగజాతర

చౌడేపల్లి, మే 29 ప్రభాతవార్త : చౌడేపల్లి పరిధిలోని చిన్నకొండామర్రిలో గంగజాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామ దేవత గంగమ్మను నడివీధిలో నెలకొల్పి విశేష పూజలు చేసారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కళాకారులు తరలివచ్చి వివిధ కళాకృతులను ప్రదర్శించారు. రాత్రంతా మహిళలు పిండి దీపాలతో అమ్మవారిని ఆరాధించారు. పొట్టకూటి కోసం బయట ప్రాంతాలకు వెళ్ళిన వారందరూ జాతరకు తరలిరావడంతో చిన్నకొండామర్రిలో సందడి నెలకొనింది.

# బంగారుపాళ్యంలో ఘనంగా గంగజాతర



బంగారుపాళ్యం, మే 29 ప్రభాతవార్త: మండల కేంద్రం బంగారుపాళ్యం నందు రెండు రోజుల పాటు గంగజాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు మురళీ గురుకుల్ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో ముత్యాలమ్మ ఆలయంను అలంకరించారు. మహిళలు అమ్మవారికి దీపారాధన, నైవేద్య పూజలు నిర్వహించారు. రాత్రి గంగమ్మను గ్రామ పురవీధుల్లో మంగళవాయిద్యాలు నడుమ ఊరేగించారు. బుధవారం వేకువజామున నడివీధిలో గంగమ్మను ప్రతిష్టించి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జంతు బలులు, అంబలి నైవేద్యాలు గంగమ్మకు సమర్పించారు. గంగమ్మను మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా దర్శించుకున్నారు. ఇందులో ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి ఛైర్మన్ ఎంబి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే బోయకొండ నందు మూడు రోజుల పాటు గంగ జాతర ఉత్సవాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త రాధామ్మ, కృష్ణప్పలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టారు. తుంబకుప్పంలో మాజీ జమీందారు నాగనరసింహులు కుమారుడు బికె గిరిబాబు ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు జరిగాయి. అలాగే అండారెడ్డిపల్లి, ఆర్‌ఆర్ నగర్, మొగిలి వెంకటగిరి గ్రామాల్లో గంగజాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# సత్యవేడు గంగమ్మకు సారె సమర్పణ



సత్యవేడు, మే 29 ప్రభాతవార్త: సత్యవేడు మండలం నాగలాపురం పరిధిలో వెలసిన సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం తరపున బుధవారం సత్యవేడు గంగమ్మకు శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. ఇక్కడ రెండు రోజులు పాటు గంగమ్మజాతర వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

**పూజలు ఊరేగింపుగా...**

ఆ మేరకు సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, ఆలయ ఇన్‌చార్జి ఈవో రామచంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు తొలుత ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అమ్మవారికి సమర్పించే చీరను(సారె) ఉంచి పూజలు చేశారు. అక్కడ నుంచి ఊరేగింపుగా ఇటు సురుటుపల్లి ఆలయ పాలకమండలి సభ్యులు, అటు గంగమ్మజాతర నిర్వాహకులు జతకట్టి నడుస్తూ మంగళ వాయిద్యాల మధ్య గంగమిట్ట వరకు ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది. అనంతరం గంగమిట్ట వద్ద అమ్మవారికి తీసుకొచ్చిన సారెను గంగజాతర నిర్వాహకులకు ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, పాలక మండలి సభ్యులు, దేవస్థానం అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఎంపీపీ ప్రతిమ, వైసీపీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఎం.పి.రవి, వంశీకృష్ణ, మదనంబేడు, రాము తదితరులు పాల్గొన్నారు.

# వడమాలపేటలో ఘనంగా గంగజాతర



వడమాలపేట, మే 29 ప్రభాతవార్త: వడమాలపేట గంగజాతర బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి గంగమ్మ ప్రతిమను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం స్థానిక బస్టాండ్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గుడిలో భక్తుల సందర్శనార్థం గంగమ్మను కొలువుదీర్చారు. బుధవారం రాత్రి కుంభం వేసి, దున్నపోతును బలి ఇచ్చి గ్రామంలో పొలి తిరుగుతారు. అనంతరం గంగమ్మ గంగలో కలుపుతారు. దీంతో గంగమ్మ జాతర ముగుస్తుంది. మండలంలోని తిరుమణ్యం, టీసీ అగ్రహారం గ్రామాల్లోని గంగమ్మజాతరను ఘనంగా నిర్వహించారు. వడమాలపేట ఎస్‌ఐ ధర్మారెడ్డి తన సిబ్బందితో కలసి శాంతిభద్రతలను పరిరక్షించారు.

# అమిత్‌షాకు ఘనస్వాగతం పలుకుదాం:కోలా



శ్రీకాళహస్తి,మే 29 ప్రభాతవార్త : భారతీయ జనతాపార్టీ నాయకులు కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా గురువారం తిరుమలేశుని దర్శనార్థం విచ్చేస్తున్న సందర్భంగా విమానాశ్రయంలో ఘనస్వాతం పలకటానికి రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ సారథ్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం కోలా ఆనంద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ బుధవారం కేంద్ర మంత్రితో చర్చించామని వివరించారు. ఉత్తర ప్రదేశ్‌లో చివరి దశ ఎన్నికల ప్రచారం ముగించుకొని గురువారం సాయంత్రం 6గంటలకు ప్రత్యేక విమానంలో తిరుపతి రానున్నట్లు వివరించారు,శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అంతర్జాతీయ తిరుపతి విమానాశ్రయంలో ఆయనకు కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున స్వాగతం పలకటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. విమానాశ్రయంలో పార్టీ క్యాడర్‌తో కలుసుకున్న తరువాత ఆయన తిరుమలేశుని దర్శనానికి వెళతారని కోలా ఆనంద్ కుమార్ వివరించారు.ఈమేరకు శ్రీకాళహస్తిలోని బిజెపి నాయకులను సమాయత్తం చేసారు.

# తుమ్మలగుంట గంగమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే



తిరుపతిరూరల్, మే 29 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గంగజాతర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అమ్మవారి ప్రతిమను తయారుచేసి, నడి వీధున ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేసారు. బుధవారం మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో ఊరేగింపుగా సారెను తీసుకుని ప్రభుత్వ విఫ్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు గంగమ్మకు సారె సమర్పించారు. అనంతరం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసారు.

# కౌంటింగ్ రోజు అల్లర్లు... గొడవలకు దిగితే కఠిన చర్యలు - డిఎస్పీ శ్రీనాథ్

### - కుప్పంలో సాయుధ బలగాలచే మాబ్ ఆపరేషన్ .. మాక్ డ్రిల్ !!





కుప్పంరూరల్, మే 29 ప్రభాతవార్త : ఎన్నికల ఓట్లు లెక్కించే రోజు జూన్ 4వతేది ఎవరైనా అల్లర్లు, గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని కుప్పం డిఎస్పీ శ్రీనాథ్ హెచ్చరించారు. బుధవారం ఎఎస్పీ నాగేశ్వరరావు, డిఎస్పీ లక్ష్మణ్‌రావు, ట్రైనీ డిఎస్పీ పవన్‌కుమార్, అర్బన్ సిఐ రమణ, రూరల్ సిఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్సైలు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంత్, సుమన్, శివకుమార్ తదితరులు సాయుధ పోలీసు బలగాలతో కలసి కుప్పం బస్టాండు వద్ద మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అల్లర్లు, ఘర్షణలు జరిగితే పోలీసులు చెదరగొట్టే తీరు, అల్లర్ల నిరోధానికి తీసుకునే చర్యల గురించి ప్రదర్శన చేశారు. అనంతరం డిఎస్పీ శ్రీనాథ్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అదనపు సిఆర్‌పిఎఫ్ బలగాలను కుప్పానికి రప్పించడం జరుగుతోందన్నారు. అలాగే ఆరోజు ఎలాంటి బాణసంచా పేలుళ్ళ, ర్యాలీలు నిషేధించడం జరిగిందన్నారు. ఎవరైనా ర్యాలీలు, బాణసంచా కాల్పులు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజలకు రక్షణ కల్పించుటకు, ప్రజలకు ధైర్యం కల్పించేందుకు మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు. ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# పారదర్శక ఓట్ల లెక్కింపుకు పక్కా ఏర్పాట్లు : ఎస్పీ



చిత్తూరు, మే 29 ప్రభాతవార్త: పారదర్శక ఓట్ల లెక్కింపుకు పక్కా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంను బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు ఓట్ల లెక్కింపు కేంద్రాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి పోలీసులు సిద్ధంగా వున్నామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సక్రమంగా, పారదర్శకంగా నిర్వర్తించడానికి చేపట్టిన అన్ని ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని ఉద్దేశించి క్రమశిక్షణ, నిష్పాక్షపాత ధోరణి పాటించాలన్నారు. ప్రతి ఓటు విలువైనదని, ప్రతి ఓటరు అభిప్రాయం గౌరవించబడాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో సిసి కెమెరా పర్యవేక్షణ, సెక్యూరిటీ వ్యవస్థ కఠినంగా అమలు చేస్తామన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భద్రతకు సంబంధించి ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసులు పక్కా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటరు విశ్వాసం, ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా వుండేందుకు పోలీసులు పక్కాగా విధులు నిర్వర్తించాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు, ఎన్నికల అధికారుల మధ్య సమన్వయం అవసరమని పోలీసులు ఎన్నికల అధికారులను సమన్వయం చేసుకొని ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరుగడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎఎస్పీ ఆరీఫుల్లా, డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏఆర్ డిఎస్పీ ఇలియాజ్‌భాషా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. లక్ష విలువైన కర్నాటక మద్యం స్వాధీనం

### - డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



కర్నాటక అక్రమ మద్యం, నిందితుడిని పట్టుకొన్న టుటౌన్ పోలీసులు

చిత్తూరు, మే 29 ప్రభాతవార్త: చిత్తూరు టుటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తేనెబండ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము పోలీసులు తేనెబండకు చెందిన ఎ.లోకేష్(28) అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుండి ఒక లక్షల రూపాయల విలువైన కర్నాటక మద్యంతో పాటు ఒక వాహనంను స్వాధీనం చేసుకోవడం జరిగిందని డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపు సమీపిస్తుండటంతో కర్నాటక నుండి అక్రమంగా మద్యం తెప్పించి చిత్తూరులో సరఫరా చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని పోలీసులకు సమాచారం అందిందన్నారు. తేనెబండలో కర్నాటక అక్రమ మద్యం విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో బుధవారం తెల్లవారుజాము 5.30 గంటలకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య, ఎస్ఐ జి.హరిప్రసాద్, పి.శ్రీనివాసులు, టి.ప్రసాద్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి వెళ్ళారన్నారు. ఆ సమయంలో అక్కడ ఆంజనేయస్వామి గుడి సమీపంలోని ముళ్ళ పొదల్లో కర్నాటక మద్యం నిల్వ వుంచి విక్రయాలు చేస్తుండటంతో లోకేష్‌ను పట్టుకొని విచారిస్తే అతని వద్ద ఒక లక్ష రూపాయలు విలువ చేసే 11 బాక్సుల బెంగళూరు బ్రాందీ, మద్యంను తరలించడానికి ఉపయోగించిన మోటర్ సైకిల్ వుండటంతో వీటిని స్వాధీనం చేసుకొని లోకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. లోకేష్‌పై ఇది వరకు పలు స్టేషన్లలో పలు కేసులు నమోదై వున్నాయన్నారు. ఫిబ్రవరి నెలలో పోలీసులు లోకేష్‌ను చిత్తూరు తహసిల్దారు ఎదుట బైడోవర్ చేయడం జరిగిం దన్నారు. లోకేష్‌ను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య, ఎస్ఐ టి.ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ సి.బాబు, కానిస్టేబుళ్ళు ఎస్.తవరాజ్, జె.స్టీఫెన్, వి.జగన్నాథంలను డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అభినందించారు.